

సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ వెంకటయ్య, కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, నాయకులు శంకర్, రాంబాబు నాయక్, మీరాదేవి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు - రాంనగర్, ఆంధ్రజ్యోతి

బీజేపీ నుంచి బండి సంజయ్‌ను బహిష్కరించాలి

నల్లకుంట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాతృమూర్తిని ఉద్దేశించి పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను ఆ పార్టీ నుంచి బహిష్కరించాలని బీజేపీ కేంద్ర అధిష్ఠానాన్ని తెలంగాణ గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ డిమాండ్ చేశారు.శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడసంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి కృష్ణగౌడ్, నగర మహిళా విభాగం అధ్యక్షురాలు అనురాధగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

5న యూపీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభం

ముషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రధాన రోడ్డులో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఈ నెల 5న ప్రారంభించనున్నట్లు ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహా, ఎమ్మెల్యే ముఠాగోపాల్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక డివిజన్ కార్పొరేటర్లు, వైద్యశాఖ ఉన్నతాధికారులు తదితరులు హాజరుకానున్నారని తెలిపారు.



రాజపేట చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల 10 తరగతి విద్యార్థులకు నిర్వహించిన అల్పాహార పంపిణీ కార్యక్రమానికి గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఈవో చిరంజీవి, ఐవోఎస్ స్వరూపారాణి, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ కార్యదర్శి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు - ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి



జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులపై సమీక్ష

గోల్నాక, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ మూసీపై కొత్తగా నిర్మాణం చేస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులపై శనివారం గోల్నాక తులసీనగర్ కాలనీలోని తమ క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ప్రాజెక్టు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి బ్రిడ్జి నిర్మాణం పనితీరును ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పూర్తిస్థాయిలో సమీక్షించారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో న్యూదుర్గానగర్, ఓల్డ్‌దుర్గానగర్, అంబేద్కర్‌నగర్ ఆలీకేఫ్ ప్రాంతాల ప్రజలకు కలిగే ఇబ్బందులపై వారి నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. ఆ ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వారికి అన్ని విధాలుగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఈఈ కిరణ్‌తో పాటు పలువురు అధికారులు, ఆయా ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం

నల్లకుంట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా, అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు అందించిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. శనివారం నల్లకుంటలోని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, నాయకులు దేశ్‌ముఖ్, అశోక్‌కుమార్, సునీల్, రాజు, సత్యప్రకాష్, సూర్యాపేట మాజీ కౌన్సిలర్ శేషకుమారి పాల్గొన్నారు.

8న లక్ష్మీగణపతి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు

చిక్కడపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో ఈనెల 8న మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ లక్ష్మారెడ్డి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 5 నుంచి రాత్రి 8 వరకు ఏకవార రుద్రాభిషేకాలు, ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు స్వర్ణపుష్పార్చనలు, సాయంత్రం 6 గంటలకు శ్రీ ఉమామహేశ్వర కల్యాణం, రాత్రి 9 నుంచి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరుగుతాయని వివరించారు. ఇతర వివరాలకు 7382610889 నెంబర్‌లో సంప్రదించాలని అన్నారు.

టెట్ పరీక్షల్లో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కటాఫ్‌గా 75 మార్కులు ఉండాలి

బర్కత్‌పుర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్షల్లో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 75 కటాఫ్ మార్కులు విధించాలని నేషనల్ ఈడబ్ల్యూఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు తాడిశెట్టి పశుపతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టెట్ పరీక్ష నిర్వహించిన తర్వాతనే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టెట్ పరీక్షలో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 90 మార్కుల కటాఫ్ విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, విజయశ్రీ, శరణ్, నందిని పాల్గొన్నారు.



ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీలకు వెళ్తున్న ఎల్.కేతన శ్రీవల్లికి ఆర్థిక సహకారం అందించిన తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణచైతన్య - నల్లకుంట, ఆంధ్రజ్యోతి

వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి

బర్కత్‌పుర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీధర్, శివకుమార్, తిరుమలేష్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో ఆనందం

చిక్కడపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలు మనసుకు ఆనందాన్ని కలిగిస్తాయని సామాజికవేత్త దోసేటి సత్యం అన్నారు. తుఫాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలకు స్వీట్లు, సమోసాలు, గ్లూకో ప్లస్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యం మాట్లాడుతూ.. యువత సంపాదనతో పాటు సేవా కార్యక్రమల్లో పాల్గొనాలన్నారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్, రాజు, నర్సింగ్, లక్ష్మీనారాయణ, రవీందర్‌గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అవసరం లేదు

- దేశ భవిష్యత్, గౌరవం కోసం మోదీని మరోసారి గెలిపించాలి
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కేసీఆర్ కనిపించడం లేదు
- తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుంటున్న రాహుల్‌గాంధీ ముఠా
- విజయ సంకల్ప యాత్ర ముగింపు బహిరంగ సభలో కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



బహిరంగసభలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు

అంబర్‌పేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కనిపించడం లేదని, ఆ మధ్య నల్గొండ సభలో కనిపించాడని, రాష్ట్రానికి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అవసరం లేదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ ముఠా రాష్ట్రాన్ని దోచుకుంటుందని విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించిన విజయ సంకల్ప యాత్ర ముగింపు బహిరంగసభ శనివారం అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత 65 ఏళ్లల్లో కాంగ్రెస్ పార్టీ చేయని అభివృద్ధిని ప్రధాని మోదీ తన హయంలో చూపించారని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ నాయకత్వంలోని యూపీఏ పాలనలో 12 లక్షల కోట్ల ప్రజాధనం దోపిడీ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో టూజీ, బొగ్గు, కామన్‌వెల్త్ క్రీడల స్కామ్‌లు జరిగాయన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఉగ్రవాదం పూర్తిగా అణచివేశారని అన్నారు. రైతులకు యూరియా సమస్య లేకుండా చేశారన్నారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం ఆయుష్మాన్‌భవ భారత్ పథకాన్ని చేపట్టారని అన్నారు. రాబోయే ఎన్నికలు దేశ భవిష్యత్, దేశ గౌరవానికి సంబంధించినవని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ లేదని, ఇక రాదని ఆ పార్టీకి భవిష్యత్ లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో రాహుల్ ట్యాక్స్‌ను వసూలు చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాకేష్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, మాజీమంత్రి ఈటెల రాజేందర్, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చింతల రాంచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బొడిగే శోభ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, డాక్టర్ ఎస్.గౌతమ్ రావు, శ్యాంసుందర్‌గౌడ్, జి.ఆనంద్‌గౌడ్, చిట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగింపు యాత్ర విజయవంతం

బర్కత్‌పుర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విజయ సంకల్ప యాత్ర ముగింపు ర్యాలీ అంబర్‌పేట నియోజకవర్గంలో అట్టహసంగా నిర్వహించారు. నారాయణగూడ వైఎంసీఏ నుంచి డప్పుల నృత్యాలు, కోలాట బృందాలతో ఈ ర్యాలీ ముందుకు సాగింది. నారాయణగూడ వైఎంసీఏ వద్ద సాయంత్రం 3 గంటలకు ఈ ర్యాలీ ప్రారంభం కాగా రాత్రి 7 గంటలకు అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాకు చేరుకుంది. బర్కత్‌పుర, లింగంపల్లి చౌరస్తా, చప్పల్‌బజార్, మోతీమార్కెట్, నింబోలిఅడ్డ, బర్కత్‌పుర చమాన్, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా, తిలక్‌నగర్, గోల్నాక కూరగాయల మార్కెట్, జిందాతిలిస్మాత్‌నగర్, ఛేనెంబర్ చౌరస్తా, శివం రోడ్, రెడ్ బిల్డింగ్, బాపూనగర్, చెన్నారెడ్డినగర్, పటేల్‌నగర్, సీపీఎల్ మెయిన్ రోడ్ మీదుగా శ్రీరమణ చౌరస్తాకు చేరుకుంది. ఈ యాత్రలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, ఉపాధ్యక్షులు రమేష్‌యాదవ్, కోశాధికారి సూర్యప్రకాష్‌సింగ్, కిషన్‌రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి, కార్పొరేటర్లు ఉమాదేవి, అమృత, అధికార ప్రతినిధులు అజయ్‌కుమార్, శ్రీధర్, నియోజకవర్గం కన్వీనర్ శ్యామ్‌రాజ్, డివిజన్ అధ్యక్షుడు కృష్ణకుమార్, నాగభూషణంచారి, జగన్, రవీందర్‌గౌడ్, యువమోర్చా నాయకులు యశ్వంత్, ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మధుసూదన్‌యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు పల్స్‌పోలియో

- ముషీరాబాద్‌లో 14,100 మంది చిన్నారులకు పంపిణీ
- హాజరు కానున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పోలియో రహిత సమాజ స్థాపన కోసం 5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమం ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రారంభం కానున్నది. నియోజకవర్గంలో 14,100 మంది 5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు పంపిణీ చేయనున్నారు. ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) పరిధిలో 2,986 మంది చిన్నారులు, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ పరిధిలో 5,281, రంగానగర్‌లోని బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీ పరిధిలో 5913 మంది చిన్నారులకు పోలియో చుక్కల మందులు వేయనున్నారు. ముషీరాబాద్ యూపీహెచ్‌సీ పరిధిలో 14 కేంద్రాలు, ఒక మొబైల్ టీమ్ పనిచేస్తుందని, ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంక తెలిపారు. అలాగే భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ పరిధిలో 26 కేంద్రాలలో, బైబిల్‌హౌస్ యూపీహెచ్‌సీ పరిధిలో 21 కేంద్రాలలో చుక్కల మందు వేయనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రాకేష్ పేర్కొన్నారు. మొదటిరోజు చుక్కలమందు వేసుకోని చిన్నారులకు సోమవారం, మంగళవారం, బుధవారం వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కల మందు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠాగోపాల్, స్థానిక కార్పొరేటర్లు హాజరవుతారని వారు తెలిపారు.



ర్యాలీలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు

ముషీరాబాద్‌లో ర్యాలీ..

పోలియో పై అవగాహన కల్పిస్తూ 5 సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరి చుక్కలమందు వేయించాలని సూచిస్తూ ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల నుంచి వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ముషీరాబాద్ విద్యా మండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, స్కూల్ కార్యదర్శి రత్నం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

రాంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రిసిటీ విభాగంలో పనిచేస్తున్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరాం తెలిపారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ ఎం.కోదండరాం, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరై డైరీని ఆవిష్కరించారు. అనంతరం బక్కి వెంకటయ్య మాట్లాడుతూ జీవోలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లు ప్రభుత్వ శాఖలలో అమలు జరగకపోతే తన దృష్టికి తీసుకువస్తే అధికారులకు నోటీసులు ఇచ్చి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరేపల్లి మోహన్, ప్రధాన కార్యదర్శి మాతంగి శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం తదితరులు



సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ (ఎంఎల్) రెవల్యూషనరీ ఇనిషియేటివ్, పీసీసీ (ప్రొవిజనల్ సెంట్రల్ కమిటీ) మూడు పార్టీల విలీన మహాసభ ఈ నెల 3, 4, 5న ఖమ్మంలో నిర్వహిస్తున్నందున వాల్‌పోస్టర్ ఆవిష్కరణ శనివారం విద్యానగర్‌లో జరిగింది. కార్యక్రమంలో ఆ పార్టీల నాయకులు కె.రమ, ఎం.హన్మేష్, ఎస్.ఎల్.పద్మ, ప్రదీప్, ఎస్.నాగేశ్వరరావు, ప్రవీణ్; పుష్ప, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు - రాంనగర్, ఆంధ్రజ్యోతి



ప్రదర్శనలు నిర్వహించిన కళాకారులు

ఆకట్టుకున్న జగదేకవీరుని కథ దృశ్యకావ్య ప్రదర్శన

చిక్కడపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వీణాపాణి కళానిలయం, వీనస్ జెమ్స్ బీట్స్‌ల సంయుక్తాధ్వర్యంలో త్యాగరాయగానసభలో శనివారం సాయంత్రం నిర్వహించిన జగదేకవీరుని కథ దృశ్యకావ్యం ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. 'సర్వజతుల లయ విన్యాసం అభినయ విలాసం' శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొ. జీఎం.శ్రీదేవి జగదేకవీరుని కథ పాటకు అనుగుణంగా నిర్వహించిన అభినయం రంజింపచేసింది. వెంకటస్వామి నిర్వహించిన రావణబ్రహ్మ ఏకపాత్రాభినయం సభికులను అలరించింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ గాయకుడు డా.అక్కిరాజు సుందరరామకృష్ణ, రచయిత రఘు, ఎస్బీఐ మాజీ ఏజీఎం త్రినాథరావులు ప్రొ.శ్రీదేవిని సన్మానించారు. వారు మాట్లాడుతూ.. పాటలోని పాత్రలను అనుకరిస్తూ శ్రీదేవి నిర్వహించిన అభినయం ఆకట్టుకుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖనటుడు జంగయ్యగౌడ్, గాంధీ, వరలక్ష్మి పాల్గొన్నారు



మాట్లాడుతున్న గురుకుల ఉపాధ్యాయ బాధితుల సంఘం ప్రతినిధులు

గురుకుల ఉపాధ్యాయుల పోస్టుల భర్తీలో జీవో 6ను అమలు చేయాలి

బర్కత్‌పుర, నల్లకుంట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గురుకుల ఉపాధ్యాయుల పోస్టుల భర్తీలో జీవో 6ను అమలు చేసి బ్యాక్‌లాగ్ పోస్టులను మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని గురుకుల ఉపాధ్యాయ బాధితుల సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జేసీ, డీసీ, ఆర్‌జీటీ, డీజీటీ నాలుగు రకాల పోస్టులకు ఒకే పరీక్ష నిర్వహించడం వల్ల ఒక్కొక్క అభ్యర్థి నాలుగు పోస్టులకు సెలెక్ట్ అయ్యారని వారన్నారు. సెలెక్టయినా అభ్యర్థులు ఒక్క పోస్టును మినహాయించి మిగత మూడు పోస్టులను బ్యాక్‌లాగ్‌గా ప్రభుత్వం ప్రకటించిందని, దీని వల్ల మెరిట్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అశోక్‌కుమార్, గురుకుల ఉపాధ్యాయ బాధిత సంఘం అధ్యక్షురాలు అస్మాబేగం, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి మనోహర్, సమన్వయకర్త కృష్ణ సంఘం ప్రతినిధులు మంజుల, అరుణ, జ్యోతి, పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

రాంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అవినీతి,అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అక్రమాలకు పాల్పడే అధికారులను తొలగించాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌కు టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా శనివారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కఠిన చర్యలు అమల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, జి.యాదగిరి రావు, వెంకటేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పాములు రాకుండా చర్యలు తీసుకోవాలి

రాంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ప్రహరీని అనుకుని ఉన్న రామకృష్ణనగర్, మల్లికార్జున్‌నగర్, రహత్‌నగర్, న్యూవినాయక్‌నగర్‌లోకి పాములు రాకుండా ఓయూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి సూచించారు. శనివారం ఇరిగేషన్, ఓయూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆమె ఓయూ ప్రహరీ గోడను అనుకుని ఉన్న పలు బస్తీలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బస్తీవాసులు పాల్గొన్నారు.



బీజేపీ జాతీయ అధ్యక్షు జేపీ నడ్డాను కలిసి శాలువతో సత్కరించి పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని వేడుకున్న ఓబీసీ మోర్చా నేషనల్ మెంబర్ పెరిక సురేష్

అర్హులందరికీ ఆరు గ్యారంటీల పథకం అమలు

చిక్కడపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీల పథకం అమలవుతుందని రాజీవ్‌గాంధీ నగరపాలిక సంఘటన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గుర్రం శంకర్ అన్నారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లిలోని బాపునగర్‌లో ఇంటింటికి తిరుగుతూ రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు విద్యుత్ ఉచితం వంటి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సుబ్బారావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, జలమండలి అధికారులు, బీఆర్ఎస్ నేతలు

సమస్యల పరిష్కారానికి కృషి

రాంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని రిసాలకుర్షిద్‌జాయి బస్తీలో నెలకొన్న డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ వ్యవస్థను ఆధునీకరించి బస్తీలో కొంతకాలంగా నెలకొన్న కలుషితనీరు, పారిశుధ్య సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. శనివారం బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఇలంహస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన సమస్యల పరిశీలన, పాదయాత్రలో ఎమ్మెల్యే గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిసాలకుర్షిద్‌జాయి బస్తీలోని పలు ప్రాంతాలలో ఆయన పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, తాగునీరు, కలుషితనీరు, పారిశుధ్య సమస్యను ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, మేనేజర్ సాయిలను ఆదేశించారు. పారిశుధ్య సమస్యను పరిష్కరించాలనిజీహెచ్ఎంసీ ఏఎంవోహెచ్ డాక్టర్ మైత్రేయికి సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, నాయకులు ప్రభాకర్, సయ్యద్ ఆలందార్ హుస్సేన్, సయ్యద్ కాసీమ్ హుస్సేన్, సయ్యద్ ఇర్ఫాన్ హుస్సేన్, కేశపురం వరుణ్, డేవిడ్‌రాజ్, మురళీ పాల్గొన్నారు.



రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్‌ను ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, యాదగిరిగౌడ్, నర్సింగ్‌రావులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు - రాంనగర్, ఆంధ్రజ్యోతి



అల్పాహారం పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

లయన్స్‌క్లబ్ సేవలు అద్వితీయం

చిక్కడపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలు అద్వితీయమని లయన్స్ ఇంటర్నేషనల్ డయాబెటిస్ చైర్మన్ డా. జీకే రమణ అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో పోటీపరీక్షల అభ్యర్థులు, పేద ప్రజలకు అల్పాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు దేవేందర్, శివకుమార్, సాయి రితీష్ పాల్గొన్నారు.

విద్య, వైద్యం ప్రజలందరికీ దక్కాలి

- ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి

రాంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యా, వైద్యం ప్రాథమిక హక్కు.. ప్రతి ఒక్కరికి ఇవి దక్కాలని ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డయల్ యూవర్ వీలేజ్ సభ్యులు రవి ఆధ్వర్యంలో జరిగిన పాలమూరు యాత్ర ముగింపు సందర్భంగా సామాజిక కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా, వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మారాయన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి ప్రకాష్, సత్యనారాయణ, శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌సీ కమిటీ చైర్మన్‌కు వినతి

చిక్కడపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు ఆదివారం సాయంత్రం పీఆర్‌సి కమిటీ అధ్యక్షులు, మాజీ ఐఏఎస్ అధికారి శివశంకర్‌ను కలిసి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. సమాన పనికి సమాన వేతనం, సంవత్సరానికి వెయ్యి రూపాయల ఇంక్రిమెంట్, ఉద్యోగభద్రత కల్పించాలని పీఆర్‌సి కమిటి చైర్మన్‌ను కోరినట్లు సంఘం అధ్యక్షులు శ్రీకాంత్, కార్యదర్శి సుగ్రీవ, కార్యవర్గసభ్యులు రాజేష్ తెలిపారు.